# పూజ

ముందు కాళ్ళు రెండూ ఎవరికో దండం పెడుతున్నట్టు ముందుకు జాపి, ఆ కాళ్ళ మీద మోరజాపుకుని కండ్లు మూసుకుని గాటిపాటున పండుకున్న ఆవును జూస్తాంటే ఎంగమ్మకు కడుపులో చెయ్యిపెట్టి కలబెట్టినట్టుగా వుంది. మామూలుగా అయితే యే పశువూ అట్టా పండుకోదు. ఆవు కింత మేత పెట్టమని అడుక్కుంటే, మనసులో యెంత కష్టపెట్టుకున్నా చేత నాలుగు పోసలు తీసి ఇచ్చేవాళ్ళు. అందరి కళ్ళాల్లో మేత మచ్చు కెక్కింది. అంతో ఇంతో మనుషుల కింత బువ్వయినా పెట్తారుకానీ వాళ్ళగొడ్ల నోటికాడిమేత తీసి ఇంకోరిగొడ్ల నోటికి అందించేందుకు ఎవరికీ చేతుల్రావు. ఎందుకంటే ఎవరిగొడ్ల బాధ వాళ్ళ కండ్ల ముందే కనపడుతుంటుంది కనుక. ఇచ్చే వాళ్ళ సంగతట్లా వుండనిచ్చినా అడిగే వాళ్ళకు నోర్రాదు గదా. ఇంగపొలాల్లో అంటే, యీటిల్లో ఎన్నడన్నా పచ్చదనం వుండిందా అని యీడ్నేపుట్టిపెరిగి నోళ్ళ క్కూడా అనుమాన మొచ్చేట్టుగా మాడిపోయినాయి. ఆవునొసటన తనెప్పుడో పెట్టిన కుంకం బొట్టు ఇప్పుడు మసకమసగ్గా కనిపిస్తూ తనను వెక్కరిస్తున్నట్టుగా కనిపిస్తోంది ఎంగమ్మకు. తనింత వరకూ రోజూ ఆవును పూజించడం అంతా అసంబద్ధంగా, హాస్యాస్పదంగా కనిపిస్తోంది. దానికింత మేత పెట్టి బతికించలేని పూజల వల్ల ఎవరికేం వొరిగినట్టు? పూజసంగతి తల్చుకునే సరికి ఎంగమ్మకు నరసప్ప జ్ఞాపకమొచ్చినాడు. "ఎంగమ్మా! నా మాటిను. అన్నాయంగా ఆవు సచ్చిపోతాది. ఆ పాపం నీకు తగుల్తాది. నాకు వూరికెనే ఇయ్యొద్దులే, నూర్రూపాయలిస్తాను. ఈ సచ్చేదానికింత కన్నా ఎవరిస్తారు? ఇన్నాళ్లూ పూజ్జేసి, ఇప్పుడు, సచ్చేదాకా వూరుకోని అవతల కోసుకోని తినమని మాదిగోళ్ళ కిస్తే ఎంతపాపం! ఆవును పూజిస్తే పిల్లలు పుడ్తారని ఎవరో సెప్పిన కాన్నుంచీ మాఎర్రిముండ ఆవును కొనమని సంపుతావుంది. అదెట్టన్నా ఆయె, నీ ఆవును మేం బాగాసాక్కుంటాం. నువ్వూదాన్ని కండ్లతో సూస్తావుండొచ్చు. బాగా ఆలోసించుకో" రోజు మార్చి రోజు వరసజరం మాదిరి వచ్చే నరసప్ప జెప్పేమాటలివి.

అనంతపురం జిల్లాను కరువెప్పుడూ వుండేదే. తాను సిన్నప్పట్నించీ సూస్తానే వుంది. తన నాయనకూడా సిన్నప్పట్నించీ సూస్తానే వున్నట్టుసెప్పేవాడు. మధ్యమధ్యన కరువులేని సంవత్సరాలేమైనా వుంటాయేమోకానీ పెద్దతేడా వుండదు. తేడా వున్నా తేడాలేనట్టే జనం బతకవలసిరావడమే గొప్ప అన్యాయం. మళ్ళా నరసప్పటువంటోళ్ళ సంగతివేరు. వాళ్ళక్కరువే లాభసాటిగా వుంటాది. గవర్నమెంటోడు యీడనో ఆడనో ఫర్లాంగో రెండు ఫర్లాంగులో మట్టి రోడ్డు పోసుకునో, మరవలుగట్టిచ్చో డబ్బులు పోసుకోమంటాడు. ఆపని నరసప్పగ్గాక పోతే ఆయన బామ్మర్ది నారాయణస్వామికైనా దొరకుతాది. ఇద్దర్లో యెవరికి దొరికినా ఒకటే.

పిల్చినప్పుడు పిల్చినకూలికి కూలోళ్ళు రాకపోతే "ఈ నాకొడుకులకు ఒకేడు పంటపండే సరికి కొవ్వెక్కింది. కరువొస్తే గానీ యీళ్ళ కత తెల్దు" అంటుంటాడు నరసప్ప. పంటలు పండినా కూలోళ్ళకు ప్రత్యేకంగా వచ్చేదేమీ వుండదు. కరువొస్తే మాత్రం ముందు పస్తులుండవలసింది వాళ్ళే. నరసప్పకు ఈ సంగతి తెలీదని కాదు. దాన్తో అతనికి పన్లేదు. కరువొస్తే చుట్టుపక్కలున్న సన్నకారురైతులంతా తన దగ్గరికి అప్పులకు వస్తారు. అప్పుడు వడ్డీ ఎక్కువైనా ముందు బతికితే అవతల అప్పుసంగతి చూద్దామనుకుంటారు. "ఏంజేస్తాం అవసరం" అనుకుంటారు. వాళ్ళకట్లాంటి అవసరం రావడం నరసప్పకవసరం. ఇక కూలిజనం అంటేనా? వాళ్ళు రాళ్ళనంతపురం వొదిలిపోతే అవతల దేశంలో రాళ్ళో మన్నో మోసిబతకొచ్చు.

అట్టా ఎవరూ పోవడం లేదా అంటే పోతూనూ వున్నారు. అయితే చిత్రమేమిటంటే ఇక్కడేమీలేనివాళ్ళే నరసప్పటువంటోళ్ళు ఊరొదిల్నంత తేలిగ్గా వొదల్లేరు. నరసప్పను అయితే రాళ్ళనంతపురం, కాదంటే జిల్లా అనంతపురం. ఇప్పటికే జిల్లా అనంతపురంలో ఒక్కాలూ, రాళ్ళనంతపురంలో ఒక్కాలూపెట్టుకునుండాడుకదా, అవసరమైతే ఈ కాలూ అక్కన్నే పెట్టుకుంటాడు. అటోకాలూ ఇటోకాలున్నా, రెండుకాళ్ళూ ఒకే చోటవున్నా కాళ్ళ కింద గట్టిపునాది వుంది. ఇంతభూమీ పుట్రా వుండే నరసప్ప సులభంగా ఊరొదిలి పోవడమేందో, ఏమిలేనోళ్ళు ఊరొదలకుండా ఆకలికి సావడమేందో అర్థంకాదు. అర్థమైనంతవరకూ ఒక కారణం కనిపిస్తుంది. నరసప్పటు వంటోళ్ళు వాళ్ళ కోసమే బతికితే, వీళ్ళట్లా అనుకోలేకపోతూవుండాల. కాకపోతే, ఇన్ని కరువులొచ్చినా యీ రాళ్ళనంతపురంలో జనం ఎందుకున్నట్టు?

"నా భార్యకూడా నీ మాదిరే ఆవు పూజసేస్తాది. నీ ఆవున్నువు కండ్లతో సూసుకోవచ్చు" నరసప్ప మాటలు జ్ఞాపకమొస్తున్నాయి ఎంగమ్మకు. అవును, తన ఆవు నరసప్పదైనా

కండ్లతో చూసుకోవచ్చు. చూడనిస్తాడు నరసప్ప. ఇప్పుడు నరసప్ప స్వాధీనంలో వున్న 'మిట్టపంపు' ను కండ్లతో చూడడం లేదూ? అట్టన్నమాట! మడకశిరలో ఇప్పుడు అత్తగారింట్లో కాపురం చేసుకుంటున్న నారాయణమ్మ నెలల పసిగుడ్డుగా వున్నప్పుడు, తుమ్మచెట్టు కింద గోనెపట్టా పరచి పండుకో బెట్టి, మొగుడూ తనూ కంపచెట్లు కొట్టి, కట్టలు పోసి కష్టపడి బాగు చేసుకున్న 'మిట్టపంపు' ను రెండు వేలరూపాయల బాకీకి నరసప్పకు అప్పగించినారు, కండ్లతో, కండనీళ్ళతో చూసుకోవడం లేదూ?

తమ కిందవున్నప్పటికంటే 'మిట్టపంపు' ఇప్పుడింకా బాగుంది. నరసప్ప బాగా ఎరువులు పెట్టినాడు. ట్రాక్టర్లతో సేద్యాలు సేయించినాడు. వర్షాలు లేనప్పుడు అదీ ఎండినా, వర్షాలు ఉన్నప్పుడు పంట కుమ్మరిస్తాంది. అట్లాగే ఇప్పుడు తన బక్కావును నరసమ్మకిస్తే, ఊ రోళ్ళకళ్ళాల్లోనూ, పొలాల్లోనూ పడమేసి బలిసి పోతాది. అప్పుడది ఎర్రిముండా బక్కావుగాక, బలిసి పోయిన పోట్లముండా ఆవుఅవుతుంది. దాన్నప్పుడు, పూజసేయాలనిపించదు. దాన్ని కండ్లతో చూడొచ్చు. అయితే చూసినప్పుడంతా కసిపుట్టాది, కోపమొస్తాది. నర్సప్ప పెండ్లాం దానికి పూజ్జేసినా ఊరోళ్ళందరూ దానికి బడితె పూజ్జేయాలనే అనుకుంటారు.

★ ★ ★

పొద్దు బారెడెక్కింది. ఎంగమ్మ ఇంటి ముందు వీధిలో నిలబడిన నరసప్ప "ఎంగమ్మా! ఎంగమ్మా!" అంటకేకలు పెట్టినాడు. పై మీద చొక్కా లేకుండా తువ్వాలు కప్పుకునున్నాడు. కోపంగా వున్నట్టుముఖం బిగుసుకునుంది. దారంట పోతున్నవాళ్ళు ఏదో జరిగిందనుకుని నిలబడి చూస్తున్నారు. ఎంగమ్మ ఇంట్లోనుంచీ బైటికొచ్చేదాకా వోపిక పట్టలేకపోయినాడు నరసప్ప. "ఈ ఎంగమ్మ జేసిన పన్జూడండి" ఆవును నాకియ్యవమ్మా లచ్చనంగా సాక్కుంటానన్నాను. ఉపరాగా కాదు లెక్కిస్తానన్నాను. మేతలేక దాన్ని సంపేదానికన్నా నాదగ్గరుంటే నువ్వ్వాకండ్లజూసుకోవచ్చని సెప్పినా. ఈమె జేసిందేంది? రైతుకుటుంబంలో పుట్టినోళ్ళు గొడ్డు బతికుండగానే కోతకిస్తారా? అదీ ఇన్నాళ్లూ పూజ్జేసిన ఆవును!"

"తప్పు...... తప్పు ....... పాపం" అన్నారు శ్రోతలు.

"కూలోళ్ళను పిల్చుకుందామని పోయేతలికి మారెప్పగాడూ కొడుకులూ ఆవును కోసుకుంటున్నారు! అజ్జూసేతలికి నామనసుఎట్టనో అయిందిః ఛ! ఛ! ఇట్టాపనిజేసి నోళ్ళను

వంశాలుంటాయా?"

అప్పటికే ఎంగమ్మవచ్చింది కానీ జనం దిక్కు చూస్తూ చెబుతున్న నరసప్ప గమనించలేదు.

'వంశాలుంటాయా?' అనే మాటకు ఎంగమ్మక్కోపమొచ్చింది."వంశం నాకుంది. లేదనే నువ్వు ఆవునిమ్మన్నది. నాఆవును నా ఇష్టమొచ్చినట్టు చేసుకుంటే నువ్వెవరు అడిగేదానికి?"

"ఏందీ? నీ ఆవును నీఇష్టమొచ్చినట్లూ సేసుకుంటావా? పాపం పున్నెం ఇంగేంలేవా?" అని గొంతు చించుకున్నాడు.

"ఎందుకు లేవూ? వున్నాయి. అందుకనే నా ఆవును నీకు పూజ్జేసుకునేదానికివ్వడం కన్నా, మారెప్పకు కోసుకునితినమని ఇవ్వడం పున్నెమని ఇచ్చినాను. మారెప్ప గడ్డితెచ్చి ఏసి దాని ఆకలి తీర్చినాడు. ఇప్పుడదీ మారెప్ప ఆకల్ని తీర్సుతాది. మారెప్ప ఆకలి ఇంతట్తో తీరదు నిజమే. ఇప్పటికి తీరతాది. రేపేదన్నా దొరికితే తింటాడు, లేదా సచ్చిపోతాడు. ఆవూపోతాది, మారెప్పా పోతాడు. నీ ఆకలి అట్లాటిది కాదే. తినేకొద్దీ పెరుగుతాది. మామూలు మనుషల మామూలు ఆకలి తీర్చడం పున్నెం. నీ ఆకలి తీర్చడం పాపం. నాకు తెల్సిన పాపం పున్నెం ఇదే" అని ఇంట్లోకి వెళ్ళిపోయింది ఎంగమ్మ.

*(ఈ కథ 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఆదివారం అనుబంధంలో అప్పుడు అచ్చయింది.)*

# -- కథ గురించి. . .

*1983 లోనో, 84 లోనో జర్నలిస్టుల బృందం ఒకటి అనంతపురం జిల్లాలో కరువుపరిస్థితులను పరిశీలించేందుకు పర్యటించివచ్చి, వివరాలను పత్రికలకు వెల్లడించింది. వెంగమ్మ అనే ఆమె తాను రోజూ పూజచేసే ఆవును వెట్టిమారెప్పకు ఇవ్వవలసి వచ్చిందని ఏడుస్తూ చెప్పినట్టు, ఆ సందర్భంగా వాళ్ళు చెప్పారు. ఆ ఊరిపేరూ, ఆమెపేరూ కూడా యీ కథలో అలాగే తీసుకున్నాను.*

*మేత లేకపోవడంవల్ల పూజించిన ఆవునేకోతకివ్వవలసి వచ్చిందన్నది వెంగమ్మవిషాదం. ఆ 'పూజ' కు నేనుమరో అర్థాన్ని కల్పించాను. కరువును విడివిడి సంఘటనలుగా చెప్పి 'సెంటిమెంట్స్' తో కూడిన విషాదంగా చూపించకుండా, కరువుకు వీలైనంత సామాజికరూపం ఇచ్చే ప్రయత్నం చేశాను. స్థానికంగా వుండే దోపిడినీ, దోపిడీదారులతో ప్రభుత్వాలకుండే సంబంధాన్నీ, సూచించాను. వెంగమ్మ దోపిడీని ప్రతిఘటించినట్టు చిత్రించడం ద్వారా 'వ్యక్తి' అంత భయంకరమైన కరువులోనూ బ్రతుకుతూనే వున్నట్టు ఆశావహమైన సంకేతాన్నివ్వడం (సం) కల్పితం.*